# మేమూ మనుషులమే!

-పంజాల జగన్నాథం

ఇంటిముందర రకరకాల పూలమొక్కలు, క్రోటన్స్‌తో తోటంతా పచ్చగా నవనవలాడుతోంది. సంధ్యాసమయం. చల్లనిగాలి, పూల సువాసనలు గుబాళిస్తున్నాయి. అరుంధతి పచ్చిక మీద కూచుని ఎటో చూస్తూ... ఏవో ఆలోచిస్తూ దిగులుగా దిక్కులో చుక్కలు లెక్కిస్తోంది. వాతావరణం ఆహ్లాదంగా ఉన్నా అరుంధతి మనస్సు మాత్రం చికాకుగా ఉంది. ఎన్నో ఆలోచనలు ఆమె బుర్రలో గిర్రున తిరుగుతున్నాయి. మనస్సును ఆలోచన్నుంచి మళ్లించడానికి వారపత్రిక తిరగేస్తోంది. మనస్సు లగ్నం కావడం లేదు. పత్రిక మూసేసింది. ఆమె మనసంతా అల్లకల్లోలంగా ఉంది. వేదాంతిలా మారితేనే జీవితంలో తృప్తి ఉంటుందేమో...! అరుంధతి తనలో తాను నవ్వుకుంది. ఆ నవ్వులో జీవం లేదు.

అరుంధతి మనసు పొరల్లో జ్ఞాపకాలు... కళ్లల్లో నీళ్లు చిప్పిల్లాయి. కొంగుతో తుడుచుకుని చుట్టూ కలియ జూసింది. సన్నని చీకటి తెరలు కమ్ముకుంటున్నాయి. ఆమె చీకటి సముద్రంలోకి జారిపోతున్నట్లు ఫీలవుతోంది. 'మహిళా హక్కులు, భావ స్వేచ్ఛ, ఆర్థిక స్వావలంబన...!' అరుంధతి మనసు పరిపరి విధాల ఆలోచిస్తోంది.

"ఆపా! ఏంటి బాగా ఏతాయిస్తున్నావ్?' అంటూ పక్కింటి ముస్లిం అమ్మాయి సోహాని అరుంధతి ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ అక్కడికి చేరుకుంది. ఆపా అంటే ఉర్దూలో అక్క అని అర్థం. ఆ అమ్మాయి ఏదో గవర్నమెంటు ఆఫీసులో ఉద్యోగం చేస్తోంది. చలాకయిన అమ్మాయి. కలుపుగోలు మనిషి. సాయంత్రం సమయాల్లో అప్పుడప్పుడు అరుంధతి వద్దకు వస్తూ ఉంటుంది. వాళ్లిద్దరు సమావేశమయ్యారంటే ఎన్నో సామాజిక అంశాలు చర్చకు వస్తూఉంటాయి. అవి గృహసీమ, వీధి నుంచీ మొదలుకొని విదేశీయం వరకు సాగుతాయి. అరుంధతి, సోహానిలు మతాలు వేరయినా మానసికంగా భావసారూప్యతగల వ్యక్తులు. సోహానితో గడిపిన క్షణాలు అరుంధతి మానసికంగా ఎంతో ఊరట నిస్తాయి. సోహాని ప్రశ్నతో పరధ్యానంగా ఉన్న అరుంధతి తుళ్లిపడింది. సోహాని రాకతో ఆమె ముఖం వికసించింది.

"ఆ ఏముందీ సోహానీ...! ఈ వింత సమాజంలో మేల్ సొసైటీ గురించి. మహిళా స్వేచ్ఛ, మహిళా హక్కులు, మహిళా రిజర్వేషన్లు...' అంటూ సోకాల్డ్ పెద్ద మనుషులు ఏవేవో చెబుతున్నారు. చట్టాలు,శాసనాలు... అని ఏవేవో అంటున్నారు. అమల్లో కంటె నడకే. ఫైళ్లలోనే బందీలవుతున్నాయి. ప్చ్... జీవితమేఒక పోరాటం. వెలుగూ నీడలు... సుఖం, దుఃఖం... సంతోషం, విషాదం... రెండు పార్శ్వాల్లో పోరాడాలిసిందే...!" అరుంధతి భారంగా నిట్టూర్చింది. ఆమె సంసారమనే యుద్ధంలో అలసిపోయిన సైనికుడిలా అగుపడుతోంది.

"ఔనాపా! 'స్త్రీ హక్కుల పరిరక్షణ' చట్టాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. చిత్తశుద్ధి ఏది? పేపర్లో ఎన్ని చూడ్డంలేదు, అమెరికాలో ఓ తెలుగువాడు కట్నంకోసం భార్యను ముక్కలుగా నరికి చెత్తకుండీలో వేశాడట. మరో శాల్తీ ఓ కాలేజి అమ్మాయి తన ప్రేమని కాదన్నదని... ఆ అమ్మాయిని నరికాడట... హత్యలు... అత్యాచారాలు... ఎన్ని ఉదంతాలు. మేల్ యిగోజమ్...!"

"ఔను సోహాని! విద్యావంతులు సైతం స్త్రీజాతికి సముచిత స్థానం ఇవ్వడం లేదు. గృహహింస... భౌతిక హింస... మానసిక హింస... సంస్కారం లేని చదువులెందుకు...?! మనస్సుల్లో మౌలికంగా మార్పు రానంతవరకూ ఏ శాసనాలు ఏం జేస్తాయి?" నిర్వేదంగా చెప్పింది.

"ఔను...! అరుంధతి ఆపా! బడాదిల్ ఉండాలె తప్ప ఇవన్నీ ఏంజేస్తాయి! బాగా సోంచాయించి

మనసు పాడు చేసుకోకు. తబియత్ కరాబయితది."

"ఆలోచించకుండా ఉండలేకపోతున్నాను సోహాని. ఎంత కాలం ఈ ఆంక్షలు. ఈ దౌర్జన్యం. బాల్యంలో పితృ నిర్బంధం. యవ్వనంలో భర్త నిర్బంధం. వృద్ధాప్యంలో పుత్ర నిర్బంధం. స్త్రీకి ఆత్మ గౌరవం, ఆర్థిక స్వావలంబన, స్వయం ప్రతిపత్తి, నిర్ణయాధికారం ఎక్కడున్నాయి?" అరుంధతి మస్తిష్కంలో ఎన్నో ఆలోచనలు అలజడి చేస్తున్నాయి. చిక్కని చీకట్లు పరిసరాలను ముసురుకుంటున్నాయి. సోహాని గడియారం చూసుకుని 'చాలా సేపయింది ఆపా!' అంటూ అరుంధతి దగ్గర సెలవు తీసుకుని వెళ్లిపోయింది.

ఆకాశంలో నక్షత్రాలు మిణుకు మిణుకుమంటున్నాయి. వీధిలో నియాన్ దీపాల కాంతి రేఖలు పరుచుకున్నాయి. చల్లని మలయమారుతం వీస్తోంది. వాతావరణం నెమ్మదిగా వేడిని కోల్పోయి చల్లబడుతోంది. డాబాల మీద జనం సేద తీర్చుకుంటున్నారు. ఇంట్లో దబేల్ మని శబ్దం. అరుంధతి తుళ్లిపడింది. ఆలోచనలు తెగిపోయాయి. హడావుడిగా ఇంట్లోకి వెళ్లింది. హాల్లో పిల్లలు చానెల్స్ విషయంలో కొట్లాడుకుంటున్నారు. రిమోట్ కొరకు పెనుగులాడుతున్నారు. పెనుగులాటలో ఫర్నిచర్ చిందరవందర అయింది.

"బొడ్డీ ఇవ్వలే!" అంటూ అక్క హర్ష మీదకు సుమంత్ ఎగిరెగిరి పడుతున్నాడు. జడ పట్టుకు లాగుతున్నాడు. సుమంత్‌కు రెజిల్స్ అంటే ఇష్టం. హర్షకు సంగీతం అంటే ప్రాణం. 'పాడుతా తీయగా' బాలు ప్రోగ్రాం చూడాలని హర్ష. వేరు వేరు ఛానెల్లో ఒకసారే ప్రసారమవుతున్నాయి.

''ఏంట్రా ఈ లొల్లి!'' అరుంధతి పెనుగులాడుతున్న పిల్లలిద్దరిని విడదీసింది. సముదాయించింది. హర్ష ఫ్రాక్ చిరిగింది. జడ చెదిరింది. సుమంత్ షర్టు గుండీలు తెగిపోయాయి. ఇద్దరూ మొసపోస్తున్నారు, అరుంధతికి చిర్రెత్తుతోంది. కోపంతో టి.వి. ఆఫ్ చేసింది. తనకు తాను సంబాళించుకుని "రేపటి నుండి యూనిట్ టెస్టు కదా! మరి కాసేపు చదువుకోవాలి.'' అంటూ పిల్లలిద్దరిని బుజ్జగించింది. స్నానాలు చేయించి బట్టలు మార్చింది. పాలు బిస్కెట్లు ఇచ్చింది. సోఫాలో కూచోబెట్టి చదువుకోమని పుస్తకాలు ముందరేసింది. ఇల్లంతా సర్దింది. రాత్రి భోజనాలకు వంట పనిలో నిమగ్నమయింది. ఓ గంటలో అన్నం, పప్పు, చారూ, బాయిల్డ్ ఎగ్స్ సిద్ధం చేసింది. పిల్లలు కాసేపు చదివి నిద్రతో జోగుతున్నారు. వాళ్లకు ముఖాలు కడిగి అన్నం తినిపించి పక్కవేసి పడుకోబెట్టింది.

రాత్రి బాగా పొద్దుపోయింది. రోడ్డు మీద వాహనాల రొద తగ్గింది. జనసంచారం పలుచబడింది. చుట్టు పక్కల ఇండ్లలో విద్యుద్దీపాలు ఆరిపోతున్నాయి. నిశ్శబ్ద వాతావరణం ఆవరిస్తోంది. బతుకు పోరులో అలసి పోయిన జనం నిద్రలోకి జారుకుంటోంది. భర్త రాజేశ్వరరావ్ కోసం అరుంధతి ఎదురు జూస్తోంది. పెళ్ళైంది మొదలు అతను ఏనాడూ ఇంటికి తొందరగా వచ్చింది లేదు. ఓ ముద్దూ ముచ్చటాలేదు. సరదాగా పిల్లలతో గడిపిందీ లేదు. అరుంధతి మనస్సు నిస్పృహగా మూలిగింది.

అరుంధతి ఎదురు చూసి విసిగిపోయింది. ఓపిక నశించి భోంచేసింది. వంటలు డైనింగ్ టేబుల్ మీద సర్దేసి పక్కమీద ఒరిగింది. అరుంధతి రూపవతి. ఉద్యోగం కూడా చేస్తుందని ఆమెను రాజేశ్వర్రావ్ పెళ్లి చేసుకున్నాడు. అతనూ ప్రభుత్వ ఉద్యోగి. కాపురం కొంత కాలం సజావుగానే సాగింది. అనతి కాలంలోనే అరుంధతికి తెలిసొచ్చింది అతని అసలు స్వరూపం.

రాజేశ్వర్రావ్ రోజూ ఉదయం ఇంటి నుంచి ఆఫీసుకు బయలుదేరడం... అటునుంచే క్లబ్‌లూ... బార్లూ...సినిమాలు... షికార్లు... ఏ అర్థరాత్రికో తూలుతూ ఇంటికి చేరడం... పిచ్చిగా అరవడం... ఇదంతా మామూలై పోయింది అరుంధతికి.

## ఐస్-తాజ్

ఐస్ అందమైనది
తాజ్ అంతకన్నా అందమైనది
అయితే
ఐస్ అందం కరిగిపోతుంది
తాజ్ అందం నిలిచిపోతుంది

- తాజీ ప్రసాద్

ఆలోచనలతో ఆమెకు కునుకు పట్టడంలేదు.

బజర్ శబ్దం. అరుంధతి బద్ధకంగా లేచి డోర్ తెరిచింది. కిర్రుమన్నశబ్దం. రాజేశ్వర్రావ్ మత్తుగా తూలుతూ లోనికి ప్రవేశించాడు. షర్ట్ చెమటతో తడిసింది, రయ్‌మని విస్కీవాసన. ముక్కుకు చేతిని అడ్డంగా పెట్టుకుంది. అతను పడబోయాడు. దబుక్కున చేయి పట్టుకుని నెమ్మదిగా లోనికి తీసుకెళ్లింది. తాగిన మైకంలో రాజేశ్వర్రావ్ ఏదేదో అరుస్తున్నాడు.

అరుంధతి నాన్న పిల్లల్ని చూడ్డానికి ఊరు నుంచి వచ్చాడు. భర్త విషయం ఎక్కడ తెలుస్తుందోనని భయపడుతోంది. 'భోజనం' అంటూ భర్తవైపు చూసింది. వద్దని నిర్లక్ష్యంగా సంజ్ఞ చేశాడు. బెడ్‌లో వాలిపోయాడు. ఊపిరి పీల్చుకుంది. రోజూ కలత నిద్రతో కాలం గడుపుతోంది. రోడ్డుమీద సందడి లేదు. నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ ఎక్కడో కుక్కలు మొరుగుతున్నాయి. మగత నిద్రలో ఉన్న అరుంధతికి ఏదో శరీర స్పర్శ... విస్కీవాసన... ఉచ్ఛ్వాస నిశ్వాసాలు.

అది మగ తత్వమేమో! పగలల్లా పులిలాగా గాండ్రిస్తూ... చీకటి పడగానే పిల్లిలా పెళ్లాం పక్కలోకి దూరుతారు. బయోలాజికల్ నీడ్. మనసుతో పనిలేదు. తెల్లవారింది. కరంటు కంబామీద కాకులు అరుస్తున్నాయి. ఆకాశం మబ్బు పట్టింది. పాలవాడు తలుపు తట్టాడు. అరుంధతి ఆవులిస్తూ బద్ధకంగా లేచింది. నిద్రలేమివల్ల ఆమె కళ్ళు ఎర్రగా జ్యోతుల్లా ఉన్నాయి. తలుపు తీసి పాత్రలో పాలుపట్టింది. గుమ్మంలో పేపర్ తీసి చదువసాగింది. పేపర్ నిండా నేరాలు, ఘోరాలే...! తల దిమ్ముగా ఉంటే చాయ్ కాచుకుని తాగింది.

అరుంధతి నాన్న మోహన్‌రావ్ పెందరాళే లేచి వాకిట్లో పచార్లు చేస్తున్నాడు. ఓ పక్కన నీళ్ళపంపు సౌండ్... ఎదురింట్లో సుప్రభాతం... గుడి నుండి యమ్.యస్. రామారావ్ సుందరకాండ... గాలి తరంగాలు మోసుకొస్తున్నాయి. మోహన్ రావ్ దిగులుగా ఉన్నాడు. రాత్రి గమనించిన సంఘటన అతని మనస్సును కలచివేస్తోంది. ముఖం కడుక్కున్నాడు. అరుంధతి చాయ్ అందిస్తున్నపుడు తటపటాయిస్తూనే అడిగాడు. "ఏంటమ్మా...! మీ ఆయన రోజూ ఇంతేనా...?" అని. తండ్రికి ఏదయితే తెలియకూడదని అనుకున్నదో అదే తెలిసిపోయింది. అరుంధతి బేలగా తండ్రి కళ్లలోకి చూసింది. ఇద్దరి కళ్లూ చెమ్మగిల్లాయి.

"నాన్నా....! జీవితం అన్నాక కొన్ని సమస్యలు తప్పవేమో. పరిష్కరించుకోవాలి." నిబ్బరంగా జవాబు చెప్పింది. మోహన్‌రావ్ అయోమయంగా చూడసాగాడు. గుండెల్లో ఆనంద సుమాలు... సంసారంలో అనురాగ పరిమళాలు... తన కూతురుకు కలలుగానే మిగిలాయనుకున్నాడు మోహన్ రావ్.

శ్వాస ఉన్నంతవరకు అరుంధతి బాధ్యతలనుంచి పారిపోదలచుకోలేదు. పిల్లల్ని లేపింది. ముఖాలు కడిగి స్నానాలు చేయించింది. యూనిఫామ్స్ వేసింది. యూనిట్ టెస్టుకు రివిజన్ చేసుకోమని సోఫాలో కూచోబెట్టింది. ఈ లోగా వంట చేసి లంచ్ బాక్స్‌లు సిద్ధం చేసింది. పిల్లలు ఆటోలో స్కూలుకు వెళ్లిపోయారు.

రాజేశ్వర్రావ్ ముఖం కడుకున్నాడు. 'కాఫీ' అంటూ కేకవేశాడు. అరుంధతి అతనికి కాఫీ ఇచ్చింది. అన్యమనస్కంగానే పనులు చేస్తోంది. వాళ్ల నాన్నకు అన్నం వడ్డించి ఊరికి సాగనంపింది. వంటలు డైనింగ్ టేబుల్ మీద సర్ది స్నానం చేసి తయారయింది. లంచ్ బాక్స్ తీసుకుని ఆఫీసుకు బయలు దేరింది. బస్సులో ఆమె మనస్సు ఏదేదో ఆలోచిస్తోంది. 'స్త్రీలు... వాళ్ల శరీరపు వాడి, వేడి, సుఖం... ఇవే కావాలి. హృదయస్పందన అవసరం లేదు. తరాల నుంచి మారని సత్యం...!' బాధగా మూలిగింది అరుంధతి.

'టవర్ సర్కిల్' అన్న కండక్టర్ కేకతో తెప్పరిల్లింది. గబగబా బస్సుదిగింది. వడివడిగా నడుస్తూ ఆఫీసు చేరుకుంది. అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేసి సీట్లో కూర్చుంది. ఫ్యాన్ వేయమని అటెండర్‌కు సంజ్ఞ చేసింది. ఫైళ్లు ముందరేసుకుని ముఖ్యమైన లెటర్స్‌ను పరిశీలించ సాగింది.

"ఏం అరుంధతి టైమయింది. లంచ్ చేద్దామా? ఏమిటి అదోలా ఉన్నావ్! ఏమైనా ప్రాబ్లమా?" కొలీగ్ సురేఖ అడిగింది. ఇంతలో మరో కొలీగ్ రాజ్యలక్ష్మి అక్కడికి చేరుకుంది. రోజూ వాళ్లు కలిసి లంచ్ చేస్తారు. మనసు విప్పి

మాట్లాడుకుంటారు. కష్టసుఖాలు చెప్పుకుంటారు. సమస్యలు చర్చించుకుంటారు. అవి కుటుంబం నుంచి అంతర్జాతీయం వరకూ ఉంటాయి.

అరుంధతి క్షణకాలం మౌనంగా ఉంది, "చూడు సురేఖా, సంసారం విషయంలో నా భర్తతో సర్దుకుపోలేకపోతున్నాను. ఆయన పద్ధతులు నాకు నచ్చడంలేదు. సంసార పక్షంగా ఉండే ఏ స్త్రీకీ నచ్చవ్. వాస్తవానికి, స్వప్నానికి పెద్దగా తేడా తెలియని తొలి రోజుల్లో అతనో ఇంద్ర ధనుస్సులా... నా లేత స్వప్నాలకు రంగు పులిమిన ఇంద్రజాలకునిలా అనిపించాడు. క్రమేపీ అతని నిజస్వరూపం బయటపడింది. అతని వికృత ప్రవర్తన తట్టుకోలేకపోతున్నాను."

"ఏమిటి అరుంధతి, అర్థమయ్యేటట్టు చెప్పు? నీ వేదో దాస్తున్నావ్". ప్రేమగా అడిగింది రాజ్యలక్ష్మి.

"దాచడానికేముంది! సంసారాన్ని, పిల్లల్ని పట్టించుకోని మనిషి. సమస్యలు తీర్చాల్సిన భర్తే సమస్యగా మారితే ఏం చేసేది?" బాధగా ఏకరువు పెట్టింది అరుంధతి.

అరుంధతి పరిస్థితిపట్ల స్నేహితురాండ్లు జాలిపడ్డారు. 'గృహ హింస, మానసిక హింస... అత్యాచారాలు... హత్యలు... అనివార్యమవుతున్నాయి. స్త్రీ విముక్తికి ఉద్యమాలు!" ఆవేదనతో ఆక్రోశించింది సురేఖ.

లంచ్ అనంతరం అంతా ఆఫీసు పనుల్లో మునిగిపోయారు. సాయంత్రం అయిదు కావస్తోంది. ఫైళ్లు సర్దేశారు. బ్యాగులు బుజాన వేసుకుని స్నేహితురాండ్రు ఆఫీసు బయటకు వచ్చారు ఇంటికి వెళ్లడానికి. సురేఖ స్నేహితురాండ్లకు 'బై' చెబుతూ స్కూటర్‌తో సిద్ధంగా ఉన్న భర్తతో ఇంటికి వెళ్లిపోయింది.

"రాజ్యలక్ష్మి...! సురేఖ అదృష్టవంతురాలు. అనుకూలమైన భర్త. భార్య మనస్సెరిగిన వాడు. యోగ్యుడు. కుటుంబం పట్ల ఫీలయ్యేవాడు." నిట్టూరుస్తూ అంది అరుంధతి.

"ఔను! నిజమే...! సురేఖ అదృష్టవంతురాలు." అరుంధతి చెప్పిన మాటలకు సమర్థింపుగా రాజ్యలక్ష్మి అంది. ఉసూరుమని కాళ్లీడ్చుకుంటూ ఇద్దరూ బస్‌స్టాప్ వైపు నడక సాగించారు. పొద్దంతా ఆఫీసు పనితో అలసిపోయి అరుంధతి సాయంకాలం ఇల్లు చేరుకుంది. పిల్లలు... కుటుంబం మామూలే. యాంత్రికంగా గడుస్తోంది ఆమె జీవితం.

అలసిపోయిన అరుంధతి ఓ రోజు సాయంత్రం ఇంటి ముందర పూల తోటలో కూచొని విశ్రాంతి తీసుకుంటోంది. పశ్చిమాన ఎర్రని సూరీడు కొండల చాటున దాక్కుంటున్నాడు. పసిడిరంగు పులుముకున్న ఆకాశాన్ని తదేకంగా చూస్తోంది. ఆ రోజు రాజేశ్వర్రావ్ ఆఫీసు నుంచి ఇంటికి పెందలాడే వస్తున్నాడు. నేరుగా అరుంధతి వద్దకే వస్తున్నాడు. ఆమెకు పరిస్థితి అర్థమైంది. నెల చివరి రోజులు. జల్సాలు... దుబారాలు... డిస్ ప్లే ఆఫ్ ఎకానమి... అతని జేబులు ఖాళీ అయ్యాయి. డబ్బుకోసం బూటకపు ప్రేమ ఒలకబోస్తున్నాడు. అతని గురించి తెలిశాక అరుంధతి జాగ్రత్త పడుతోంది. డబ్బు విషయంలో దూరంగా ఉంచుతోంది.

"కొంచెం డబ్బు అవసరం ఉంది!" అడిగాడు రాజేశ్వర్రావ్.

"నా దగ్గర లేవు!" కటువుగా చెప్పింది అరుంధతి.

"నీవు ఇలాగే ఉంటే మన మధ్య సంబంధాలు తెగిపోతాయి." బెదిరించాడు.

"ఫర్వాలేదు లెక్కచేయను". దృఢంగా నిర్లక్ష్యంగా చెప్పింది. చేయి చేసుకోబోయాడు. లేచిన చేయి ఆపింది. రాజేశ్వర్రావ్ హతాశుడయ్యాడు. వెర్రెక్కినవాడిలా అరుస్తూ దురుసుగా అరుంధతి మీదికి పోబోయాడు. అమె ప్రతిఘటించింది. శక్తినంతా కూడదీసుకుని బలంగా తోసేసింది. మైకంలో ఉన్న అతను

## సంగ్రామం

మనసున్న మనుషులకన్నా
మనసు సున్నా అయిన
మనుషులే మిన్నైన
ఈ లోకంలో బ్రతకటమే
నిత్య సంగ్రామం

– సింగిడి రామారావు

పడిపోయాడు. అహం దెబ్బతింది. లేచి అడుగులు తడబడుతూ ఉండగా విసవిస బయటకు వెళ్లిపోయాడు. పిల్లలు ఓ మూలకు నక్కి భయంగా జరుగుతున్నదంతా బిక్కు, బిక్కు మంటూ చూస్తున్నారు.

ఏ అర్ధరాత్రికో తప్పతాగి తూలుతూ ఇల్లు చేరాడు రాజేశ్వర్రావ్. కళ్లు అగ్ని కణాల్లా ఉన్నాయి. వస్తూనే బండబూతులు ఎత్తుకున్నాడు. రాక్షసునిలా ఆమె మీదకు లంఘించాడు. కొడుతున్నాడు. "అమ్మని కొట్టద్దూ...!" అంటూ బితుకు బితుకున అడ్డమొచ్చిన పిల్లల్ని నిర్దాక్షిణ్యంగా బాదాడు. భయంతో గజగజ వణుకుతూ వాళ్లు ఓ మూల నక్కారు. అతను అరుంధతి జడపట్టుకుని పశుబలంతో బరబరా ఈడ్చి గుమ్మం అవతల పడేశాడు. పిల్లల్ని సైతం బయటకు తోసేశాడు.

అరుంధతి జరిగిన అవమానాన్ని సహించలేకపోయింది. 'ఓరేయి...! ఇంతకాలంగా నా ఆశలను చంపుకున్నాను. నా ఆవేశాన్ని అణుచుకున్నాను. ఎంత హింసించినా ఓర్పు వహించాను. ఇక నాలో సహనం నశించింది. ఇపుడు నేనొక ఆడ బెబ్బుల్ని. ఇక నీతో దేనికయినా సిద్ధమే." అంటూ కోపంగా ఊగిపోసాగింది అరుంధతి.

రాజేశ్వర్రావ్ పెడచెవిన పెట్టాడు ఆమె మాటల్ని. ఓ నిర్లక్ష్యపు చూపు విసిరాడు. అరుంధతి భరించలేకపోయింది. సివంగిలా లేచి మీద పడింది. కాలర్ పట్టుకుని నిలదీసింది. రాజేశ్వర్రావ్ కల్లు తాగి నిప్పులు తొక్కిన కోతిలా చిందులు వేస్తున్నాడు. "ఇంట్లోంచి వెళ్లిపో!" అంటూ వెర్రెక్కిన వాడిలా మెడబట్టి బయటకు గెంటివేశాడు.

ఆత్మాభిమానం గల అరుంధతి పిల్లల్ని వెంటబెట్టుకుని బతకడానికి విశాల ప్రపంచంలోకి బయలు దేరింది. పిల్లలపట్ల బాధ్యత, జీవితం పట్ల యోచన, భవిష్యత్ పట్ల విశ్వాసం చంపుకోలేదు. రాజేశ్వర్రావ్‌పై న్యాయ పోరాటం చేయడానికి నిశ్చయించుకుంది. రాజేశ్వర్రావ్ పిల్లల్ని లాక్కోబోయాడు. ప్రేమతో కాదు. దూడని లాక్కెళితే పాలిచ్చే ఆవు వస్తుందని. పిల్లలు అతన్ని అసహ్యించుకున్నారు.

తల్లిపాత్ర పవిత్రమైందనీ... బాధ్యతాయుతమైందనీ... తల్లి ప్రాపకంలోనే పిల్లలు ప్రయోజకులవుతారని భావించింది. భార్య చనిపోతే నెల తిరగక ముందే మరోస్త్రీని పెళ్లి చేసుకోవడం కోసం వెంపర్లాడే మగజాతి గురించి అరుంధతికి బాగా అర్థమయింది. చెదిరిన గుండెల్ని బిగపట్టుకుని కష్టాల కడలిలో ఈదడానికి సిద్ధపడింది. అరుంధతి జీవితాన్ని కదిలిస్తే అన్నీ కన్నీళ్లే. ఆమెకు వర్తమానం గడ్డుగా ఉంది. భవిష్యత్ అగమ్యగోచరంగా ఉంది. చేదు అనుభవాల తాలూకూ జ్ఞాపకాలు ఆమె మనస్సును అల్లకల్లోలం చేస్తున్నాయి. తను అనుభవించిన అవమానం... బాధ... దుఃఖం... అన్నీ మరిగి మరిగి ఆమె గుండెల నుండి ఉవ్వెత్తున కన్నీళ్లుగా ఉబికాయి. చెక్కిళ్లపై ధారలు... అరుంధతి సంక్లిష్టమైన పరిస్థితిలో సంఘర్షిస్తోంది.

పిల్లల భవిష్యత్ గుర్తుకు రాగానే ఆమె మనస్సులో చైతన్యవంతంగా సాగే ఆలోచనా ధారలు ఒక్కసారిగా గడ్డ కట్టుకుపోతున్నాయి. ఎన్నో ఆశలు... అడియాశలు... కష్టాలు... కడగండ్లు... కన్నీళ్లు... అన్నీ అమె మనస్సును పట్టి కుదిపేస్తున్నాయి. నైరాశ్యంలో పడిపోతున్న అరుంధతికి తన పిల్లలే ప్రాణవాయువు నింపుతున్నారు. జీవితలక్ష్యాన్ని నిర్దేశిస్తున్నారు.

అరుంధతి మనస్సు పరివరి విధాల ఆలోచిస్తోంది. 'మహిళలు దేంట్లో తక్కువనీ? సాహిత్య రంగమా... సాంస్కృతిక రంగమా... సాంకేతిక పరిజ్ఞానమా... సామాజిక సేవనా... పరిపాలనా విషయాల్లోనా! మహాశ్వేతాదేవి, అరుంధతి రాయ్, బాల సరస్వతి, కల్పనా చావ్లా, మథర్ థెరిస్సా, మేధాపాట్కర్, ఇందిరాగాంధీ, కిరణ్‌బేడి... ఎందరో పలురంగాల్లో ఘనమైన కృషిచేశారు. చేస్తున్నారు...!' ఉద్రిక్త ఆలోచనలతో భారంగా కళ్లు మూసుకుంది.

కాలం మారుతోంది. కొత్తగాలి వీస్తోంది. కొత్త మేఘం కమ్ముకుంటోంది. అరుంధతి తన చుట్టూ అల్లుకున్న ముళ్లకంచెను ఛేదించడానికి సిద్ధమైంది. 'మేమూ మనుషులమే! మనసున్న మనుషులమే! మమ్మల్ని తిరుగుబాటు చేయనీయకండి. ఉద్యమాల బాటవైపున నడవనీయకండి...! అంటూ ఆప్టిమిస్టిక్‌గా ఆలోచిస్తూ... తను ఆశిస్తున్న మార్పుకోసం ఎదురు చూస్తోంది. ■